
సాక్షి
సిద్దిపేట

I

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



ఊరిని మార్చిన తీర్మానం

జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్‌లో మద్యం విక్రయాలు బంద్ చేసి దశాబ్దం పూర్తవుతోంది.

వివరాలు IIలో ▸



అధిక వర్షాలతో అప్రమత్తం

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి సూచించారు.

వివరాలు IIలో ▸



అంతా మా ఇష్టం

దుబ్బాక పట్టణంలో రోడ్లను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు.

వివరాలు IIIలో ▸

పేదరికమే అతి పెద్ద సమస్య

దరిచేరని స్వేచ్ఛ, సమానత్వం


- అధికార యంత్రాంగం నీతిగా పనిచేస్తేనే స్వాతంత్య్ర ఫలాలు
- 'సాక్షి' సర్వేలో ఉమ్మడి జిల్లా ప్రజల మనోగతం

సాక్షి, నెట్‌వర్క్: దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 79 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా పేదరికమే అతి పెద్ద సమస్య అనే అభిప్రాయం జిల్లా వాసుల్లో వ్యక్తమవుతోంది. పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అవి అర్హులకు చేరడం లేదనేది స్పష్టమవుతోంది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించింది. ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య? స్వేచ్ఛ - సమానత్వం ఎంత మందికి దరిచేరింది? స్వాతంత్య్ర ఫలాలు అందరికి దక్కాలంటే ఏ రంగం నీతి, నిజాయితీగా పనిచేయాలి? ఇలా మూడు ప్రధాన మైన అంశాలపై సర్వే చేపట్టింది. ఈ అంశాలపై సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల పరిధిలో వివిధ వర్గాలకు చెందిన 90 మంది అభిప్రాయాలను సేకరించింది. పేదరికం తర్వాత అతిపెద్ద సమస్య వైద్యమే అని సర్వేలో పేర్కొన్నారు. కుల వివక్ష కూడా ఎక్కువగానే ఉందని, అవినీతి కూడా ప్రధాన సమస్యల్లో ఒకటని తేలింది.

అందని స్వేచ్ఛ-సమానత్వం..

స్వేచ్ఛ - సమానత్వం ఇంకా ప్రజలందరికి చేరువకాలేదని సాక్షి చేపట్టిన సర్వేలో వ్యక్తమైంది. 60 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సుమారు 28 శాతం మంది కొద్ది మందికే చేరువైందని చెప్పారు. 12 శాతం మంది అందరికీ స్వేచ్ఛ - సమానత్వం చేరువైందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. అధికార యంత్రాంగం నీతి నిజాయితీగా పనిచేస్తేనే స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కుతాయనే అభిప్రాయాన్ని సగం మందికి పైగా అభిప్రాయపడ్డారు. చట్టసభలు, న్యాయస్థానాలు మరింత నీతి, నిజాయితీగా పనిచేస్తేనే సాధ్యమవుతుందని తేల్చి చాలా మంది చెప్పారు.

ఈ సర్వే ఫలితాలు ఇలా..



కొలువులు రావాలి.. సంపద పెరగాలి

పేదరికం తగ్గాలి.. నాణ్యమైన విద్య అందించాలి

- స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వాలి
- పరిమిత రంగాలలోనే రిజర్వేషన్లు వర్తింపజేయాలి
- ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాలి
- 'వందేళ్ల భారతం'పై విద్యార్థుల మనోభావాలు

బానిస సంకెళ్లు తెంచుకొని పరాయి పాలన నుంచి విముక్తి పొందిన మన దేశం.. 78 ఏళ్లల్లో ఎంతో పురోగతి చెందింది. ఈ నేపథ్యంలో స్వాతంత్య్రం కోసం పోరాడిన వారి ఆశలు, ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి చెందిందా? పరిపాలన ఎలా సాగుతోంది? ఇంకా ఎలా ఉండాలి? టెక్నాలజీ, ఎడ్యుకేషన్, హెల్త్, నిరుద్యోగం వంటి అంశాలపై గురువారం పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థులతో 'సాక్షి' టాక్ షో నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు 2047 నాటికి భారతదేశం ఎలా ఉండాలనే విషయాలను పంచుకున్నారు.

సిద్దిపేటఅర్బన్



సాక్షి టాక్ షోలో పాల్గొన్న విద్యార్థులు

ఆర్థికంగా బలపడితేనే..



దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది. చదువుకు తగిన ఉద్యోగాలు లేకపోవడంతో విదేశాలకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. దేశంలో ఎక్కువ సంఖ్యలో యువత ఉన్నప్పటికీ అభివృద్ధిలో వెనకబడిపోతున్నాం. క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను అందిస్తే ఆటోమేటిక్‌గా అన్ని రంగాలలో మెరుగవుతాం. ఆర్థికంగా బలపడితే పేదరికం తగ్గి దేశ సంపద పెరుగుతుంది.

- సత్యనారాయణ, సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థి

రాజకీయ పదవులకు అర్హత ఉండాలి



ఏ ఉద్యోగానికి అయినా కనీస విద్యార్హత, నైపుణ్యాలు వంటివి పరిగణనలోకి తీసుకుంటారు. కానీ పరిపాలన అందించే వారికి, రాజకీయ పదవులకు ఎలాంటి అర్హతలు లేకపోవడం వల్ల ఇంకా వెనకబడి పోతున్నాం. రాజకీయ పదవులకు కూడా కనీస అర్హతలు పెట్టాలి. ఉన్నత చదువులలో క్వాలిటీ ఎడ్యుకేషన్ లేకపోవడం వల్ల చాలా మంది ఇతర దేశాలకు వెళ్లి చదువుకొని అక్కడే స్థిరపడిపోతున్నారు. దీని వల్ల మైగ్రేషన్ పెరిగి దేశాభివృద్ధికి సాయపడే వారు తగ్గిపోతున్నారు.

-నవ్య, సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థిని

స్టడీస్‌లో అడ్వాన్స్ టెక్నాలజీని చేర్చాలి



ప్రస్తుతం ఉన్న సిలబస్ అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడే విధంగా లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీని సిలబస్‌లో చేర్చాలి. హెల్త్ కేర్ రంగాలలో ప్రైవేట్ వారిదే ఆధిపత్యంగా ఉంది. వైద్య రంగంలో ప్రభుత్వం ఆధిపత్యం సాధించాలి. ప్రకృతిని కాపాడుకుంటూ టెక్నాలజీని విస్తృత పరచుకోవాలి.

-సాయిప్రవర్షిణి, సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థిని

ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలి



దేశం ఇంకా అభివృద్ధి చెందాలంటే ఇండస్ట్రీస్ ఎక్కువగా రావాలి. ప్రభుత్వం ఇండస్ట్రీల ఏర్పాటుకు సబ్సిడీలు ఇచ్చి కంపెనీలు నెలకొల్పేలా చేయూత ఇవ్వాలి. మత ఘర్షణ లు ఆపి ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలి. అనవసరమైన వాటి కోసం ఉచితాలు ఇవ్వకుండా దేశాభివృద్ధికి దోహదపడే వాటికే ఉచితాలు ఇచ్చే విధంగా నాయకులు ఆలోచన చేయాలి.

-ఖాజా హుస్సేన్, సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థి

కొన్ని రంగాల వాటికే..

ప్రతి రంగంలో రిజర్వేషన్లు వర్తింపజేయడం వల్ల క్వాలిటీ, కంటెంట్ ఉన్న వారు ప్రైవేట్ రంగంలో స్థిరపడిపోతున్నారు. దీని వల్ల ప్రభుత్వ వ్యవస్థలు వెనకబడిపోతున్నాయి. ఎడ్యుకేషన్ పరంగా రిజర్వేషన్లు ఇవ్వాలి. కానీ ఉద్యోగాలలో ఇవ్వడం వల్ల దేశానికి నష్టం జరుగుతోంది. ప్రభుత్వ పరంగా ఇండస్ట్రీస్ పెరగాలి. ఉద్యోగాల కల్పన ఎక్కువ మొత్తంలో కల్పించే విధంగా మార్పు రావాలి.

-అఖిల్, సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థి

అత్యాధునిక బోధనే లక్ష్యం కావాలి

- ఇంజనీరింగ్ కళాశాల ఆదర్శంగా నిలవాలి
- ఫోన్‌లో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్
- మొదటి ఏడాది తరగతులు ప్రారంభం



ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యా బోధన అత్యుత్తమంగా ఉండాలని, ఆ విషయంలో రాజీ పడవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణ శివారు కిషన్ నగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులను కలెక్టర్ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం హైదరాబాద్ నుంచి ఫోన్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. హుస్నాబాద్ నాలుగు జిల్లాల పరిధిలో ఉందని, ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కళాశాల స్థాపనకు తనతో పాటు కలెక్టర్, వైస్ చాన్స్‌లర్ ఎంతో కృషి చేశారన్నారు. కళాశాలలో అధునాతనమైన వసతులు కల్పించడం నా బాధ్యత అన్నారు. కళాశాలలో అధ్యాపకులు, స్టాఫ్ నియామకంలో రాజకీయ జోక్యం లేకుండా అంతా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కే అప్పగించామన్నారు. కళాశాల నిర్మాణం కోసం 35 ఎకరాల భూమిని కేటాయించామని, త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. అకాడమిక్ విద్యా ప్రమాణాలతో ఇతర కళాశాలతో పోటీ పడి చదువు చెప్పాలని అధ్యాపకులకు సూచించారు. మొదటి బ్యాచ్ విద్యార్థులే ఈ కళాశాలకు అంబాసిడర్లు అని మంత్రి అన్నారు.

ఆధునిక వసతులు కల్పిస్తాం: కలెక్టర్

ఇంజనీరింగ్ కళాశాలలో ఆధునిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ హైమావతి తెలిపారు. జిల్లా పరిపాలన తరఫున అన్ని సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే హుస్నాబాద్‌లో అగ్రికల్చర్ యూనివర్సిటీ కళాశాల కోసం స్థలం పరిశీలించాలని మంత్రి కోరారని తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

విద్యార్థులు ఇష్టపడి చదివి రాష్ట్రంలోనే నంబర్ వన్ కళాశాలగా పేరు తేవాలని వైస్ చాన్స్‌లర్ ఉమేశ్ కుమార్ పిలుపునిచ్చారు. క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, ప్రాక్టికల్ గదులు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అత్యాధునికమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు జాబ్‌తోపాటే బయటకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవి కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.





తీజ్.. జోష్

జిల్లా కేంద్రంలో గురువారం తీజ్ సంబురం అంబరాన్నంటింది. గోర్ బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిసారిగా నిర్వహించిన తీజ్ నిమజ్జన కార్యక్రమానికి గిరిజనులు వేలాదిగా తరలివచ్చారు. మొదట భవానిదేవి, సంత్ సేవాలాల్ చిత్ర పటాల వద్ద తీజ్ (గోధుమ నారు)లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వేషధారణ, మన కట్టుబొట్టు, మన భాషే మన అస్థిత్వమన్నారు. ఎస్టీలకు అనేక ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. మనం ఇతరులను గౌరవించడంతో పాటుగా మనం గౌవింపబడే విధంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించి కోమటి చెరువులో తీజ్‌లను నిమజ్జనం చేశారు.

- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

న్యూస్‌రీల్

గురుకులాల్లో 18న స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల(సిద్దిపేట): సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 18న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయాధికారి పోలోజు నర్సింహాచారి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చేర్యాల, వర్గల్, కొండపాక, అల్వాల్, దుబ్బాక, కోహెడ, చిన్నకోడూరు, హుస్నాబాద్ బాలుర పాఠశాల, కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. అలాగే ములుగు, గజ్వేల్, జగదేవ్‌పూర్, సిద్దిపేట రూరల్, రామక్కపేట, మిట్టపల్లి, తొగుట, బెజ్జంకి బాలికల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 18న చేర్యాల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో, మూడు జిరాక్స్ సెట్లతో ఉదయం 9 గంటల లోపు హాజరై పేరు నమోదు చేసుకోవాలని నర్సింహాచారి సూచించారు.

నేడు, రేపు మాంసం విక్రయాలు బంద్

సిద్దిపేటజోన్: స్వాతంత్య్ర దినోత్సవం, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలో శుక్ర, శని వారాల్లో మాంస విక్రయ దుకాణాలు మూసి వేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తెలిపారు. జంతు వధ నిషేధ చట్టం ప్రకారం మాంసం అమ్మడం నిషేధించినట్లు ఆయన పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మాంస విక్రయదారులకు గురువారం నోటీసులు జారీ చేశారు.

జేఏసీ బైక్ ర్యాలీ



గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేర్యాలలో గురువారం జేఏసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ఎనిమిదేళ్లుగా అనేక రకాల పోరాటాలు చేస్తున్నా పాలకులు స్పందించడంలేదన్నారు. ఈక్రమంలోనే ఈ నెల 25న అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామనారు. ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు మండలంలోని ముస్త్యాల, వీరన్నపేట, చుంచనకోట, కడవేర్గు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపూరి, శబాష్ గూడెం గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించిన అఖిలపక్ష నాయకులు ఇంటింటికి జాతీయ రహదారి ముట్టడి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బాల్‌నర్సయ్య, మల్లారెడ్డి, సంజీవులు, నారాయణరెడ్డి, రాజేందర్, నాగేశ్వర్‌రావు, కరుణాకర్, వెంకట్‌మావో, తిరుపతిరెడ్డి, మల్లేశం, ఎల్లారెడ్డి, సత్తిరెడ్డి, గురువయ్యగౌడ్, సంతోష్, కిషన్, సిద్దప్ప, పాండు, కొండయ్య, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీ, టీఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్న

హబ్షీపూర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో

దుబ్బాక: యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. హబ్షీపూర్ చౌరస్తాలో గురువారం జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వందలాది మంది రైతులు ఆందోళనకు దిగడంతో ఎల్కతుర్తి–మెదక్ జాతీయ రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కీర్తిరాజులు బలవంతంగా రైతులను అక్కడినుంచి పంపించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. రైతులు మాట్లాడుతూ యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



దుబ్బాక: హబ్షీపూర్ చౌరస్తాలో రైతుల రాస్తారోకో

రైతుల నిరీక్షణ

నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల పీఏసీఎస్‌కు గురువారం యూరియా వస్తోందని ప్రచారం జరగడంతో తెల్లవారుజాము నుంచే రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. చాల సేపటి నుంచి నిరీక్షించిన యూరియా రావడం ఆలస్యం కావడంతో చెప్పులు క్యూలైన్‌లో పెట్టారు. యూరియా ఇవ్వడం ప్రారంభించగానే ఒక్కసారిగా లోపలికి చొచ్చుకొని రావడంతో గందరగోళం ఏర్పడింది.

కొరత తీరేవరకు పోరాటం

గజ్వేల్: యూరియా కొరత తీర్చేంతవరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఇందిరాపార్కు చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టగా వారి ఆందోళనకు ప్రతాప్‌రెడ్డి మద్దతు పలికి బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.



నంగునూరు(సిద్దిపేట): క్యూలైన్‌లో రైతులు



ఘనంగా తిరంగా ర్యాలీ

గజ్వేల్‌రూరల్: పట్టణంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి బసవేశ్వర విగ్రహం వరకు 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని అగ్రగామిగా నిలుపుతున్న ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలుద్దామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎల్లు రాంరెడ్డి, నందన్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ శాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా పురస్కారాలు

టెన్త్ టాపర్స్‌కు అవార్డులు

- నలుగురికి నేడు మంత్రిచే ప్రదానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టెన్త్ (2024–25) పరీక్షల్లో రాణించిన నలుగురు విద్యార్థులకు విద్యా పురస్కారాలు వరించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఈ అవార్డులను అందజేస్తోంది. జిల్లాలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు అవార్డులను అందజేయనున్నారు. శుక్రవారం జరిగే పంద్రాగస్టు వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా అందుకోనున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ అయాన్ (579), అదే పాఠశాలకు చెందిన బొడ్డు శివకుమార్ (577), బక్రిచెప్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మిర్జా సఫోరా (570), హుస్నాబాద్‌లోని ఆదర్శ పాఠశాలకు చెందిన అఖిల (567) మార్కులు సాధించినందుకు ప్రోత్సాహక అవార్డులు అందించనున్నారు.

చాలా సంతోషంగా ఉంది



అవార్డు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదివి 579 మార్కులు సాధించాను. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన అందిస్తున్నారు. కేవలం చదువుపై దృష్టి సారించే ఏదైనా సాధించవచ్చు. కేంద్రీకరించాలి. నేను జకాత్ ట్రస్ట్ ద్వారా ఇంటర్ చదువుతున్నాను.

-మహ్మద్ అయాన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్

కార్పొరేట్‌కు దీటుగా బోధన



ఇందిరానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తున్నారు. టెన్త్‌లో 577 మార్కులు సాధించాను. ప్రస్తుతం శ్రీమేధా ట్రస్ట్ ద్వారా ఇంటర్ చదువుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం మాలాంటి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం సంతోషంగా ఉంది.

- బొడ్డు శివకుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్

అమ్మ నాన్నల కష్టాన్ని చూసే..



అమ్మ నాన్నల కష్టాన్ని నిత్యం గమనిస్తున్నాను. పట్టుదలతో చదువుతూ రాణిస్తున్నాను. టెన్త్‌లో 570 మార్కులు సాధించాను. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యాను అందిస్తున్నారు. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీ బాసరలో చదువుతున్నాను. ఇలాంటి ప్రోత్సాహకాలు మరింత రాణించేలా చేస్తాయి.

- మిర్జా సఫోరా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బక్రిచెప్యాల

పేదవారికి సేవ చేయడమే లక్ష్యంగా ఉద్యోగం సాధిస్తా



పేదవారికి సేవ చేయడమే లక్ష్యంగా బాగా చదివి ఉన్నత ఉద్యోగం సాధిస్తా. పదో తరగతిలో 567 మార్కులు సాధించాను. ప్రస్తుతం బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి బోధన, క్రీడా మైదానంతో పాటు అన్ని సౌకర్యాలు ఉంటాయి.

- కసవేణి అఖిల, ఆదర్శ పాఠశాల హుస్నాబాద్

క్లుప్తంగా

అధిక వర్షాలతో అప్రమత్తం
కలెక్టర్ హైమావతి


మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: రానున్న రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి ప్రజలకు సూచించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీసీలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అధికారులకు సెలవులను మంజూరు చేయడం లేదని, అన్ని స్థాయిల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఏదైనా సమస్య వస్తే 08457-230000ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రమ్యశ్రీకి 'గ్లోబల్ ఎడిషన్' అవార్డు


రమ్యశ్రీ

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్లకి చెందిన విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి ముత్యంరెడ్డి కుమార్తె సివిల్ ఇంజనీర్ దేవిరెడ్డి రమ్యశ్రీ నేషనల్ ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ డిజైన్ ఎక్సలెన్స్ 2025(గ్లోబల్ ఎడిషన్) అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఈ నెల 21 బెంగుళూర్‌లో జరిగే ఆర్కిటెక్చర్ల కాన్ఫరెన్సులో అవార్డును అందజేయనున్నట్లు నిర్వాహకురాలు సోనియా, డాక్టర్ ఆనంద్ గోపాల్ నాయక్ పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి


శేఖర్(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): వల్లూర్ జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. నార్సింగి ఎస్ఐ సృజన కథనం మేరకు... నార్సింగి మండలం వల్లూర్‌కి చెందిన ఆనందాస్ శేఖర్(35) పొలం పనులు చూసుకొని ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో జాతీయ రహదారిని దాటుతుండగా నిజామాబాద్ వెళ్తున్న ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు తీవ్రగాయాలు కావడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో నార్సింగిలోని ప్రైవేటఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సృజన తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని లకుడారం గ్రామ శివారులో కల్పన వెంచర్‌లో సుమారు 30 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడన్నారు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లగా.. చెట్టుకు ఉరివేసుకొని ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ విషయమై వెంచర్ సూపర్‌వైజర్ రమేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని సిద్దిపేట గజ్వేల్ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాటలో పట్టుబడిన ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెండ్

మెదక్ మున్సిపాలిటీ: పేకాట ఆడుతూ పట్టుబడిన ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పేకాట ఆడుతూ కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్‌లు పట్టుబడ్డారు. శాఖపర చర్యల్లో భాగంగా వారిని సస్పెండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

తలపై బండరాయితో కొట్టి మహిళ హత్య

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని రాంతీర్థ్ శివారులో ఓ రేకుల షెడ్డులో గురువారం తుర్కవడ్‌గాంకి చెందిన సింగిడొడ్డి నర్సమ్మ(40)ను తలపై బండరాయితో కొట్టి హత్య చేశారు. మృతదేహాన్ని చూసిన పశుకాపరులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ దుర్గారెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. అనంతరం వివరాలు సేకరించగా.. రాంతీర్థ్‌కి చెందిన రాజుతో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు బయటపడింది. దీంతో రాజుపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నిందితుడి గుర్తించేందుకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించారు. ఈ హత్యక సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



గీతా స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన

దేశభక్తి.. స్వాతంత్య్ర స్ఫూర్తి

తూప్రాన్: పట్టణంలోని గీతా స్కూల్ విద్యార్థులు స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. గురువారం సుమారు 300 మంది విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో త్రివర్ణ పతాకం ఆకృతిలో కూర్చుని స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటారు. అంతేకాకుండా జెండాకు ఇరువైపుల జాతీయ పుష్పం 'కమలం' ఆకారంలో కూర్చుని అలరించారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ దేశభక్తిని చాటారు. ఈ మేరకు విద్యార్థుల ప్రదర్శనను పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు ప్రశంసించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ ఉష , డైరెక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణగుప్త, ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగ ఫలమే.. స్వాతంత్య్రం

- దిశ కమిటీ సభ్యుడు ప్రవీణ్ కుమార్
- ఆకట్టుకున్న తిరంగా ర్యాలీ

దుబ్బాకటౌన్: ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే ఈ స్వాతంత్య్ర ఫలాలని జిల్లా దిశ కమిటీ సభ్యుడు సుంకోజీ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు, బీజేపీ నాయకులు 150 మీటర్ల త్రివర్ణ పతాకంతో పట్టణంలోని పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో భాగంగా దేశ భక్తి నినాదాలతో పట్టణ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాష్ రెడ్డి, మల్లారెడ్డి, రవి కుమార్, రమణా రెడ్డి, రమేష్ రెడ్డి, తదితరులున్నారు.



దుబ్బాకలో భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

ఆదాయం అదుర్స్

నాలుగు రోజుల్లో రూ.9.07 కోట్ల ఆదాయం

ఆర్టీసీకి కాసుల గలగల
- కలిసొచ్చిన వరుస సెలవులు
- పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు

ఉమ్మడి మెదక్ జిల్లా డిపోల ఆదాయం వివరాలు

డిపో	మహాలక్ష్మి ఆదాయం(రూ.లక్షల్లో)	మహాలక్ష్మి ప్రయాణికులు	నగదు ఆదాయం (రూ.లక్షల్లో)	నగదు చెల్లింపు ప్రయాణికులు	మొత్తం ఆదాయం (రూ.లక్షల్లో)	మొత్తం ప్రయాణికులు
దుబ్బాక	44.75	78,221	19.36	24,968	64.11	1,03,189
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	89.35	1,64,394	43.16	61,436	132.51	2,25,830
మెదక్	87.09	1,83,324	54.95	79,641	142.04	2,62,965
నారాయణఖేడ్	51.85	63,089	32.81	35,967	84.66	99056
నర్సాపూర్	25.73	57,820	11.01	22,607	36.74	80,427
సంగారెడ్డి	85.57	1,69,769	57.29	80,015	142.86	2,49,784
సిద్దిపేట	95.22	1,57,648	75.21	78,094	170.43	2,35,742
జహీరాబాద్	65.33	98,281	68.37	78,135	133.70	1,76,416

నారాయణఖేడ్: రాఖీ పౌర్ణమిని ఆర్టీసీ క్యాష్ చేసుకుంది. ఈ ఏడాది తమ సోదరులకు రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్లు ఎక్కువగా ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణాలు కొనసాగించారు. ఈ మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులు కేటాయించి సొమ్ము చేసుకుంది. ఇలా ప్రతీ పండగ సీజన్‌లో ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతూ తమ మార్కును ప్రదర్శిస్తుంది. ఈ రాఖీ పౌర్ణమిని సైతం ప్రత్యేక సర్వీసులు నడిపి భారీగా ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చి ఆదాయం సమకూర్చుకుంది. ఇందులో భాగంగానే ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆర్టీసీ నిత్యం 275 సర్వీసులు నడిపింది. ఈ సర్వీసుల ద్వారా రీజియన్‌లో మహాలక్ష్మి ద్వారా 9.73లక్షలు, ఇతరులు 4.61లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి రూ.9.07కోట్ల ఆదాయం సాధించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 8 డిపోల నుంచి ఈ సర్వీసులు కొనసాగాయి. కార్మికులు తక్కువ ఉన్నా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపడంతో యాజమాన్యం వెనుకడుగు వేయలేదు. అన్ని డిపోల నుంచి స్పెషల్ సర్వీసులను నడిపింది. ఈ స్పెషల్ సర్వీసులకు రూ.100 చార్జీ వద్ద రూ.50 అదనంగా వసూలు చేశారు. మొత్తం 275 స్పెషల్ సర్వీసులు రీజియన్ పరిధిలో నడిపారు.

సర్వీసులు ఇవే..!
మెదక్ రీజియన్ పరిధిలోని ఆయా డిపోల నుంచి బస్సులను హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాలకు నడిపారు. ఖేడ్ డిపో నుంచి జేబీఎస్, సికింద్రాబాద్, లింగంపల్లి, పటాన్‌చెరు.. జహీరాబాద్ డిపో నుంచి జేబీఎస్, లింగంపల్లి, సంగారెడ్డి క్రాస్‌రోడ్డు.. సంగారెడ్డి డిపో నుంచి జేబీఎస్, సికింద్రాబాద్.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నుంచి సికింద్రాబాద్, మెదక్ డిపో నుంచి సికింద్రాబాద్, బాలానగర్ వయా నర్సాపూర్, సిద్దిపేట డిపో నుంచి జేబీఎస్, కరీంనగర్, వేములవాడ, దుబ్బాక నుంచి సికింద్రాబాద్, నర్సాపూర్ నుంచి జేబీఎస్, బాలానగర్‌తోపాటు ఇతర పలు ప్రధాన పట్టణాలు, ప్రాంతాలకు సర్వీసులను నడిపారు.


నారాయణఖేడ్: బస్సుల వద్ద ప్రయాణికుల రద్దీ

కార్మికులకు భోజన సదుపాయం..
ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడిపిన డ్రైవర్, కండక్టర్‌తో పాటు డబుల్ డ్యూటీ చేసిన వారికి సైతం ఖేడ్ డిపోతోపాటు పలు డిపోల్లో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఖేడ్ డిపో స్వీట్లు, వెజ్ బిర్యానీ పంపిణీ చేసి కార్మికులను ప్రోత్సహించారు. డబుల్ డ్యూటీ నిర్వహించిన డ్రైవర్లకు డ్యూటీ దిగగానే రూ.1,000, కండక్టర్‌కు రూ.650ల చొప్పున డీడీ (డబుల్ డ్యూటీ) అమౌంట్ అందజేశారు. అలాగే కొంతమంది కండక్టర్, డ్రైవర్‌లకు ఇన్‌సెంటీవ్ అందజేశారు.

ప్రయాణికుల సేవకు సిద్ధం



ప్రయాణికులకు సర్వీసు చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం. కార్మికులు కూడా ప్రయాణికుల అవసరాల మేరకు విధులు నిర్వర్తించేందుకు సహకరించారు. డబుల్ డ్యూటీలు సైతం నిర్వహిస్తూ సంస్థ మనుగడ కోసం పనిచేశారు. ప్రయాణికులు ఎల్లపుడూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి. కార్మికులకు వెజ్ బిర్యానీ, స్వీట్లు అందించాం.
– మల్లేశయ్య, డీఎం, నారాయణఖేడ్

కార్మికుల సమష్టి కృషి



ఆర్టీసీ సంస్థలో పని చేసే అన్ని వర్గాల కార్మికుల సమష్టి కృషితో రికార్డు ఆదాయం సాధించాం. రీజియన్ పరిధిలో రాఖీ పౌర్ణమి సందర్భంగా నాలుగు రోజులపాటు బస్సులు నడిపాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా స్పెషల్ బస్సులు నడుపుతున్నాం. రీజియన్ పరిధిలో రూ.9.07కోట్ల ఆదాయాన్ని పొందగలిగాం. మహాలక్ష్మి ద్వారా సుమారు 9.73లక్షల మంది ప్రయాణించారు.
– విజయభాస్కర్, రీజినల్ మేనేజర్, సంగారెడ్డి

ఆహా ఏమి రుచి..!

చిరుధాన్యాలతో నోరూరించే వంటకాలు

జహీరాబాద్ టౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో గురువారం వంటలు, ముగ్గులు, మెహిందీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శాంత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలకు చెందిన 106 మంది విద్యార్థులు పోటీపడి నోరూరించే పలు రకాల వంటకాలు తయారు చేశారు. ఇందులో చిరుధాన్యాలతో ఘుమఘుమలాడే బిర్యానీ, జీరారైస్, పులిహోర, దోశలు, ఇడ్లీ, గారెలు, పాయసం, పలు రకాల స్వీట్లు, జొన్న, సజ్జ రొట్టెలు వంటి వైరటీ వంటకాలు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


వంటలను ప్రదర్శించిన విద్యార్థులు

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్, డైరక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు కీర్తి, రమేష్, దత్తు, నవీన లావణ్య, శ్రావణి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా.. మన్నించు!

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేసి దేశభక్తిని చాటారు. అయితే భారత స్వాతంత్య్ర పోరాటంలో ముఖ్య పాత్ర పోషించిన మహాత్మాగాంధీని మాత్రం మరిచిపోతున్నారు. పలు చోట్ల జాతిపిత విగ్రహాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో గాంధీజీ విగ్రహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇందులో భాగంగానే మండలంలోని తిగుల్‌లో ఖబీర్ వద్ద బురుజు పక్కన గద్దెపై దశాబ్దాల క్రితం గాంధీజీ విగ్రహాన్ని ప్రతిష్టించారు. పదేళ్ల క్రితం రోడ్డు వెడల్పులో గాంధీ విగ్రహాన్ని తీసి పక్కన పెట్టి ప్రతిష్ఠంచకుండా వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు విగ్రహాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. కావున వెంటనే గాంధీ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని స్థానికులు కోరుతున్నారు.


తిగుల్‌లో గోడకు నిలబెట్టిన గాంధీ విగ్రహం

జెండా పనులు చేస్తుండగా..

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి

చేర్యాల(సిద్దిపేట): విద్యుదాఘాతానికి గురై గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వేచరేణిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ కార్మికుడు ఎండీ మోహిన్‌పాషా(32) స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల కోసం జాతీయ జెండాను సిద్ధం చేస్తున్న క్రమంలో ఇనుప పైపు 11కేవీ విద్యుత్ వైర్లకు తగలగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే చేర్యాల ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమురవెల్లి ఎస్ఐ రాజు తెలిపాడు.

స్టార్టర్ రిపేర్ చేస్తుండగా..
పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కందిపల్లిలో బోరుబావి వద్ద స్టార్టర్ రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై టేక్మాల్ విఠల్ మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఓ రైతు బోరు మోటరు ఆన్ కాకపోవడంతో రిపేర్ కోసమని విఠల్ పొలానికి వెళ్లి స్టార్టర్ బాక్స్ తనిఖీ చేశాడు. బాక్స్ ఓపెన్ చేసి చూస్తుండగా ఓ వైర్ చేతికి తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే స్థానిక రైతులు అతడిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే విఠల్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు ఉన్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లాడు

- జైలు నుంచి వచ్చిన గంటల్లోనే మళ్లీ దోపిడీ
- 24గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: ఓ కేసులో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చిన ఓ వ్యక్తి గంటల వ్యవధిలోనే మరో కేసులో చిక్కుకొని ఇలా వచ్చి.. అలా జైలుకు వెళ్లిన సంఘటన నర్సాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం, జూదం వంటి వ్యసనాలకు అలవాటైన మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం మద్దుల్వాయికి చెందిన గజ్జెల భిక్షపతిని తొలిసారి మెదక్ పోలీసులు 2015లో దొంగతనం కేసులో అరెస్ట్ చేశారు. ఆ తర్వాత వివిధ నేరాలకు పాల్పడడంతో సంగారెడ్డి జిల్లా కంది జైలుకు తరలించగా.. ఈనెల 11న విడుదలయ్యాడు. ఈనెల 13న గుమ్మడిదల నుంచి మెదక్ వెళ్తుండగా.. బస్సులో పరిచయమైన మహిళకు మద్యం, చేపలు, డబ్బు ఇస్తానని నమ్మించి నర్సాపూర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం ఆ మహిళకు మద్యం తాగించి రాయితో మోది చెవి రింగులు లాక్కొని పారిపోయాడు.

24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు..
బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి దర్యాప్తు చేపట్టారు. పట్టణంలోని ఓ వైన్స్ వద్ద ఆధారాలు సేకరించారు. అనంతరం సమాచారం మేరకు 24గంటల్లోనే గుమ్మడిదలలో భిక్షపతిని అరెస్ట్ చేసి, చోరికి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జల్సాలకు అలవాటు.. 12 కేసులు
డ్రైవర్‌గా పనిచేసే భిక్షపతి జల్సాలకు అలవాటుపడి చోరీలు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిపై మెదక్ టౌన్ పీఎస్‌ల(6), సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల(2), హత్నూర(1), నారాయణ్‌ఖేడ్(1), అల్వాల్(1)కేసుతో కలిసి మొత్తం 12 కేసులు ఉన్నట్లు ఎస్పీ వివరించారు. ఈ మేరకు నిందితుడిపై పీడీ యాక్ట్ పెట్టే ఆలోచనలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. అయితే ఈ కేసును 24గంటల్లోనే ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం, కానిస్టేబుల్ శ్రీకాంత్‌లను ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ మహేందర్‌లు అభినందించి రివార్డులు అందజేశారు.

రాష్ట్రస్థాయికి 16 మంది క్రీడాకారుల ఎంపిక

మెదక్‌జోన్: త్వరలో చైనాలో నిర్వహించనున్న అంతర్జాతీయ పాఠశాలల వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం అండర్ 15 బాలబాలికలకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల క్రీడా సమాఖ్య అధికారి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఈఓ ఆదేశాల మేరకు పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 110 మంది బాలికలు, 150 మంది బాలురు పాల్గొన్నారన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 8 మంది బాలికలు, 8 మంది బాలురు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరంతా ఈనెల 18, 19 తేదీల్లో రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుల్షన్ క్లబ్ కార్యదర్శి మధుసూదన్ రావు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ప్రభు, పీడీలు మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మధుసూదన్, వినోద్, నరేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఊరిని మార్చిన తీర్మానం

- మద్యం బంద్‌కు నేటికీ దశాబ్దం
- ఆదర్శంగా నిలుస్తున్న 'బస్వాపూర్'

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని బస్వాపూర్‌లో మద్యం అమ్మకాలు బంద్ చేసి దశాబ్దం పూర్తవుతోంది. గ్రామంలో మొత్తం 375 కుటుంబాలు ఉండగా.. 1,790 మంది జనాభా నివసిస్తున్నారు. అయితే ఈ గ్రామంలోని బెల్టుషాపుల్లో మద్యం విక్రయించడంతో తరుచూ తాగి గొడవలు చోటుచేసుకునేవి. దీంతో కొంతమంది పనులకు వెళ్లకపోవడంతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఏకమయ్యారు. ఇందులో భాగంగానే 2015లో మద్యం విక్రయాలు చేయకూడదని తీర్మానం చేసుకున్నారు. అనంతరం పంచాయతీ భవనం వద్ద గాంధీ విగ్రహం ఎదుట ప్రతిజ్ఞ చేశారు. అప్పటి నుంచి గ్రామంలో మద్యం విక్రయాలు జరగడం లేదు. ఈ తీర్మానానికి గ్రామస్తులు కట్టుబడి ఉండడంతో పాటు మండలంలోని మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.


బస్వాపూర్ వ్యూ